రైతన్నకు ఖరీఫ్ గుబులు!

- మరమ్మతులకు నోచుకోని సాగునీటి కాలువలు
- వ్యవసాయ పనులు ప్రారంభమైన కాలువల్లో పూడిక తీయని వైనం

టెక్కలి: రైతన్నకు ఖరీఫ్ గుబులు వెంటాడుతోంది. టెక్కలి నియోజకవర్గంలో వ్యవసాయ పనులు ఆరంభమైనప్పటికీ సాగునీటి కాలువల మరమ్మతుల విషయంలో జాప్యం కనిపిస్తోంది. ఇప్పటికే గ్రామాల్లో పొలాలను దుక్కితో సిద్ధం చేసుకుని విత్తనాలు వెదజల్లుతున్నారు. మరో వైపు సాగునీటి కాలువల్లో పూడికలు తొలగించకపోవడం, కొన్నిచోట్ల అధికారులు నామమాత్రపు మరమ్మతులతో చేతులు దులుపేసుకోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శివారు ప్రాంతాలకు సైతం సాగు నీరు అందజేస్తామని పలు కార్యక్రమాల్లో మంత్రి అచ్చెన్నాయుడు రైతులకు హామీలిచ్చారు. ఇదిలా ఉండగా రైతులు ఖరీఫ్ పనుల్లో బిజీగా ఉన్న సమయంలో ఒక్కసారిగా కాలువల ద్వారా నీటిని విడుదల చేస్తూ.. మరో వైపు అధికారులకు అనుకూలంగా ఉన్న కొంతమంది అధికార పార్టీ నేతలకు కాసుల వర్షం కురిపించే విధంగా వంశధార కాలువలకు మరమ్మతులు ప్రారంభిస్తారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం సాగునీటి కాలువల మరమ్మతులు చేయకపోవడంతో నియోజకవర్గంలో టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి తదితర మండలాల్లో కాలువలపై ఆధారపడి సాగు చేస్తున్న సుమారు 44,142 ఎకరాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందడం ప్రశ్నార్థకంగా మారుతోంది.



టెక్కలి ఆర్టీసీ డిపో సమీపంలో సాగునీటి కాలువల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్క



టెక్కలి సమీపంలో పంట పొలంలో విత్తనాలు వేస్తున్న రైతు

తూతూ మంత్రంగా మరమ్మతులు..

ప్రస్తుతం కొన్నిచోట్ల వంశధార అధికారులు తూతూ మంత్రంగా నామ మాత్రపు మరమ్మతులు చేస్తున్నారు. టెక్కలి నియోజకవర్గంలో మండలాల వారీగా సాగునీటి కాలువలపై ఆధారపడిన ఆయకట్టు వివరాలు ఇలా..

మండలం	ఆయకట్టు విస్తీర్ణం (ఎకరాల్లో)
టెక్కలి	8,395
కోటబొమ్మాళి	7,950
సంతబొమ్మాళి	17,797
నందిగాం	10,000



టెక్కలి ఆర్టీసీ డిపో సమీపంలో రోడ్డుకు ఆనుకుని ఉన్న కాలువ గట్టుపై తూతూ మంత్రంగా మరమ్మతులు చేసిన దృశ్యం



టెక్కలి మండలం సీతాపురం సమీపంలో పూడికలతో ఉన్న సాగునీటి కాలువ

కాలువల్లో పూడికలు తీయలేదు



రైతులు ఖరీఫ్ పనులు ప్రారంభించినా ఇప్పటి వరకు వంశధార ప్రాజెక్టు పరిధిలోని సాగునీటి కాలువల్లో పూర్తి స్థాయిలో పూడికలు తొలగించలేదు. కొన్ని చోట్ల మదుములు సరిగ్గా లేవు. సాగునీటి కాలువలపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. తక్షణమే అధికార యంత్రాంగం స్పందించాలి.

–సర్లాన బాలకృష్ణ, సర్పంచ్, రావివలస, టెక్కలి మండలం

నీరు విడుదల చేసి పనులు ఆరంభిస్తారు..



ప్రస్తుతం సాగు నీటి కాలువల్లో పూడికలు పేరుకుపోయాయి. అయితే కాలువల్లో నీరు విడుదల చేస్తూ మరో వైపు అధికార పార్టీ కార్యకర్తలకు కాసులు కురిపించేందుకు అధికారులు కుమ్మక్కై పనులు ఆరంభిస్తారు. టీడీపీ ప్రభుత్వం ఎప్పుడు అధికారంలోకి వచ్చినా ఇలాంటి దోపిడీ సర్వ సాధారణంగా ఉంటుంది.

–సత్తారు సత్యం, వైఎస్సార్‌సీపీ నాయకుడు, టెక్కలి

క్లుప్తంగా

పిల్లల సంరక్షణపై దృష్టిసారించాలి



సమావేశంలో రైల్వే అధికారులు

కాశీబుగ్గ: పిల్లల సంరక్షణపై దృష్టిసారించాలని వక్తలు అన్నారు. పలాస రైల్వే స్టేషన్ పరిధిలో రైల్వే చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశాన్ని స్టేషన్ ఆవరణలో శనివారం నిర్వహించారు. స్టేషన్ మేనేజర్ సపన్ కుమార్ దాస్ సమక్షంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో వక్తలు మాట్లాడుతూ.. పిల్లల సంరక్షణ, రక్షణకు సంబంధించి పలు కీలక సూచనలు, సలహాలు చేశారు. రైల్వే ప్రాంగణాల్లో పిల్లల భద్రత, వారికి ఎదురయ్యే సమస్యలు, వాటి పరిష్కారాలపై చర్చించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ స్కీమ్ డిపార్ట్‌మెంట్ సోషల్ వర్కర్ జనార్దన్, సీడీపీవో పార్వతి, చైల్డ్ హెల్ప్ లైన్ సూపర్‌వైజర్ జనపాన భాగ్యలక్ష్మిరెడ్డి, ఇన్‌చార్జి శివాజీ, ఆర్‌పీఎఫ్ ఏఎస్సై బిస్వాల్, జీఆర్‌పీ హెచ్‌సీ మెట్ట సోమేశ్వరరావు, టీటీఈలు, రైల్వే కూలీలు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలన్నదే ప్రధానమంత్రి నరేంద్రమోదీ లక్ష్యమని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలవలస వైకుంఠరావు అన్నారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ 14వ నంబర్ బూత్‌లో బీజేపీ పట్టణ అధ్యక్షుడు పాట్నూరు తారకేశ్వరరావు అధ్యక్షతన స్ట్రీట్ కార్నర్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ సుపరిపాలన విధానంతో పేద ప్రజల కోసం ఎన్నో రకాల సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. ఈ సందర్భంగా కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వివరాలతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించి ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మహిళా నాయకులు పాలవలస మోహిని, కణితి సుమిత్రా, వల్లభ లక్ష్మి, కణితి పావని, సంధ్యా పాల్గొన్నారు.

సీపీఎం నాయకుడు మృతికి సంతాపం

వజ్రపుకొత్తూరు: నందిగాం మండలం ప్రతాప విశ్వనాధపురం గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు బాలరాజు (75) శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వజ్రపుకొత్తూరుకు చెందిన సీపీఎం సీనియర్ నాయకులు బమ్మిడి ఆనందరావు, సీఐటీయూ నాయకులు ఎన్.మోహనరావు తదితరులు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు.

గిరిజనుల భూములు సర్వే

మందస: చీపి పంచాయతీ పద్మపురం గ్రామంలో గిరిజనులు 60 ఏళ్లుగా సాగు చేస్తున్న భూములను పెత్తందారులు ఆక్రమిస్తున్నారని ఆరోపిస్తూ గ్రామస్తులు తహసీల్దార్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. దీంతో డివిజనల్ సర్వే ఇన్‌స్పెక్టర్ మోనంగి చంద్రశేఖర్, ఆర్ఐ చిన్నారావు, మండల సర్వేయర్ బాబూరావు, వీఆర్వోలు శనివారం సంబంధిత భూములను సర్వే చేశారు. సర్వే నివేదికను ఉన్నతాధికారులకు అందజేశారు.

పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

కంచిలి: మండలంలోని పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సాయంత్రం ఎన్నిక ప్రక్రియ జరిగింది. గౌరవ అధ్యక్షుడుగా ఎస్.పాపారావు, అధ్యక్షుడుగా ఎస్.ప్రేమ్‌కుమార్, ఉపాధ్యక్షునిగా వై.రాంబాబు, సెక్రటరీగా వై.తులసయ్య, జాయింట్ సెక్రటరీలుగా ఎల్.లీలాకుమారి, బి.చైతన్య, కోశాధికారిగా కె.అనీల్‌కుమార్, ఉప కోశాధికారిగా బి.శ్రీనివాసరావు, కో–ఆర్డినేటర్‌గా డి.సంతోష్‌కుమార్‌లను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులను ఎంపీడీవో వి.తిరుమలరావు అభినందించారు.

30న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ఇచ్ఛాపురం: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్టు చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. కౌన్సిలర్‌లతో పాటు కోఆప్షన్ సభ్యులు హాజరు కావాలని సూచించారు.

బాధిత విద్యార్థులకు న్యాయం చేస్తాం

టెక్కలి: టెక్కలిలోని రవీంద్రభారతి విద్యా సంస్థలో చదివిన విద్యార్థులందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఉప విద్యాశాఖాధికారి పి.విలియమ్స్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ పాఠశాలలో చదివిన విద్యార్థులకు బదిలీ సర్టిఫికెట్లు (టీసీ)లు అందజేసే విషయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన



తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పలాస–కాశీబుగ్గ మున్సిపల్ కార్మికులు చేస్తున్న నిరసన మూడో రోజైన శనివారం కూడా కొనసాగింది. గాంధీ విగ్రహం నుంచి భగవతిరోడ్, ఓల్డ్ ఎన్‌హెచ్ 5–రోడ్, మూడు రోడ్ల కూడలి, పాత బస్టాండ్ మీదుగా ర్యాలీ చేపట్టారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెయ్యిల గణపతి, యూనియన్ నాయకులు సీహెచ్ మురగన్, కె.వెంకట్, బి.కూర్మారావు, ఎం.రవి, పి.బాలకృష్ణ, కె.ఈశ్వరరావు, ఎస్.తిరుపతి, ఢిల్లీ, ప్రకాష్ ముఖి పాల్గొన్నారు.

–కాశీబుగ్గ

వినూత్న బోధన



ఇచ్ఛాపురం మండలం ఎం.తోటూరు ప్రాథమిక పాఠశాలలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక విధానం ద్వారా ప్రధానోపాధ్యాయులు కె.సుహాశ్‌చంద్ బోధన చేస్తున్నారు. అట్టముక్కలపై అక్షరాలను అతికించి పదాలుగా విద్యార్థులకు పరిచయం చేస్తున్నారు. శనివారం పాఠశాలలో టీఎల్‌ఎం మెటీరియల్‌తో బోధన చేశారు.

–ఇచ్ఛాపురం రూరల్

నూతన కార్యవర్గానికి అభినందన



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మందస మండల నూతన కార్యవర్గాన్ని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు తన కార్యాలయంలో శనివారం అభినందిచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, జిల్లా పార్టీ కార్యదర్శి అగ్గున సూర్యరావు, పార్టీ మండల అధ్యక్షుడు దల్లి జానకీరావు, కర్రి గోపాల్, బత్తిని లక్ష్మణరావు, చింతాడ గణపతి, సొడ డిల్లీ, సిందిరి జగన్, కంచి బేహర, గున్న రమణ ఉన్నారు.

–మందస

అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి: కోటబొమ్మాళి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి కె.అచ్చెన్నాయుడు శనివారం శంకుస్థాపన, భూమి పూజ చేశారు. ఉప ఖజానా కార్యాలయం, బీటీ రోడ్ పనులు ప్రారంభంతో పాటు అన్న క్యాంటీన్ నిర్మాణానికి భూమి పూజా చేశారు. సుమారు రూ. 4.52 కోట్ల వ్యయంతో ఈ పనులు చేపట్టనున్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తి, నాయకులు కె.హరివరప్రసాద్, వి.విజయలక్ష్మి, బి.రమేష్, వి.కామేశ్వరరావు, టి.రామకృష్ణ పాల్గొన్నారు.

పశువులను కాపాడుకోవాలి

కంచిలి: ప్రకృతి వైపరీత్యాలు సంభవించే సమయంలో పశువులను జాగ్రత్తగా కాపాడుకోవాలని భువనేశ్వర్‌కు చెందిన శాస్త్రవేత్తలు డాక్టర్ అరుణ్‌కుమార్, డాక్టర్ బ్రీగేశ్వర్, డాక్టర్ సంజయ్‌కుమార్‌లు పేర్కొన్నారు. జె.నారాయణపురంలో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో గొర్రెలు పెంపకందార్లకు జాగ్రత్తలను తెలియజేశారు. పశువులకు వ్యాధులు సంభవించక ముందే వర్షాకాలంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తొలకరి వర్షాలు పడుతున్న కారణంగా గొర్రెల పెంపకందారులు విధిగా నట్టల నివారణ మందులు వాడాలని ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు కె.అప్పలస్వామి పేర్కొన్నారు. నారాయణ పురంలో నట్టల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

కార్మికుల సమ్మెతో క్షీణిస్తున్న పారిశుద్ధ్యం

- మున్సిపల్ సమావేశంలో సభ్యులు



టెండర్ విధానంలో అభివృద్ధి పనులు కేటాయించాలని కోరుతున్న వైస్ చైర్మన్ సురేష్‌బాబు

కాశీబుగ్గ: మున్సిపల్ కార్మికుల సమ్మెతో పారిశుద్ధ్యం క్షీణిస్తోందిన సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. పలాస–కాశీబుగ్గ మున్సిపల్ సమావేశం చైర్మన్ బి.గిరిబాబు అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా కోఆప్షన్ సభ్యుడు బమ్మిడి సంతోష్ మాట్లాడుతూ.. రోజురోజుకూ పారిశుద్ధ్యం క్షీణిస్తుండడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేరారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే విధంగా కృషి చేసి సమస్యను పరిష్కరించాలన్నారు. మున్సిపాలిటీలో పెరుగుతున్న జనాభా అవసరాలకు తగ్గట్టుగా పారిశుధ్య కార్మికులను దాదాపు 25 మందిని అదనంగా నియమించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు చైర్మన్ గిరిబాబు స్పష్టం చేశారు. నీలాపురం కాలనీ, తాళ్లభద్ర కాలనీల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సకాలంలో బిల్లులు చెల్లించాలని కౌన్సిలర్ కర్రి మాధవరావు కోరారు. మున్సిపాలిటీలో బ్యూటీఫికేషన్ కింద కొన్ని ప్రధాన ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటేందుకు కొన్ని ప్రాంతాలను ఎంపిక చేయాలని ఇన్‌చార్జి కమిషనర్ కనకరాజు సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనికి సభ్యులు స్పందిస్తూ కేటీ రోడ్డుతో పాటు పురుషోత్తపురం, ఆంధ్రా బ్యాంకు రోడ్డు, ఎర్ర చెరువు, ముత్యాలమ్మ కోనేరు, ప్రభుత్వ కళాశాల గ్రౌండ్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల గ్రౌండ్, కోసంగిపురం జంక్షన్, మూడు రోడ్ల జంక్షన్ తదితర ప్రాంతాల్లో మొక్కలు నాటాలని సూచించారు. తిలక్ నగర్‌లో పవర్ బోరు మరమ్మతులకు గురి కావడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సమస్యను పరిష్కరించారు కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ కోరారు. వైస్ చైర్మన్ మీసాల సురేష్ మాట్లాడుతూ.. అంబుసోలి, ప్రకాష్‌నగర్, ఇందిరా కాలనీ, ముత్యాలమ్మ కోనేరు వద్ద హెచ్‌డీపీఈ పైప్ లైన్ పనులు వేసేందుకు నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్టర్లకు పనులు ఇవ్వొద్దని టెండర్ పిలవాలని సభ దృష్టిని తీసుకువచ్చారు. సమావేశంలో వైస్ చైర్మన్ బి.కృష్ణారెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు రోణంకి శ్రీనివాస్, కౌన్సిలర్లు దుర్గా శంకర్ పండా, బెల్లాల శ్రీనివాస్, బోర చంద్రకళ, బడగల సుజాత, శిష్టు బృందావతి, దున్న నిర్మల, గురిటి సూర్య నారాయణ, డిక్కల ఆనంద్‌రావు, పప్పల ప్రసాద్, జోగా త్రివేణి, బల్ల రేవతి, తంగుడు ఆశారాణి, సప్ప అమ్మాజి, సవర సోమేశ్ పాల్గొన్నారు.

ర్యాంకర్లకు సత్కారం



విద్యార్థినులను సత్కరిస్తున్న కళాశాల సిబ్బంది

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థినులు టి.హారిక, ఎస్.రుక్మిణిలను శనివారం సన్మానించారు. ఇటీవల విడుదలైన ఏపీ పీజీసెట్ ఫలితాల్లో మొదటి ర్యాంకు సాధించిన హారిక, అలాగే గత ఏడాది పీజీ సెట్‌లో ఒకటో ర్యాంకు సాధించిన రుక్మిణిలను ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. అలాగే ఇరువురు ర్యాంకుల సాధన కోసం కృషి చేసిన అధ్యాపకుడు డి.వాసుబాబుకు మెమెంటోను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

'ఆలోచించు నిదానంగా ఓ క్షణం' వీడియో ఆవిష్కరణ

వజ్రపుకొత్తూరు రూరల్: చిన్నారులు, యువత క్షణకావేశంతో ఆత్మహత్యలకు పాల్పడి అకాల మరణంతో పుత్రశోకం నింపుతున్న ప్రస్తుతం తరుణంలో పుక్కళ్ల క్రియేషన్స్‌పై ఉద్దాన కళాకారులు వీడియో, ఆడియో రూపంలో ఓ సందేశాత్మకమైన పాటను చిత్రీకరించారు. అక్కుపల్లిలోని మూడు రోడ్డు కూడలిలో శనివారం ఏపీ తెలుగు ఫిల్మ్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కుమార్ నాయక్ చేతుల మీదగా పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు సిక్కోలు జానపద సాహిత్య కళా వేదిక అధ్యక్షులు మామిడి కృష్ణారావు మాట్లాడుతూ.. ప్రస్తుత రోజుల్లో చిన్నారులను, యువత చిన్న చిన్న విషయాలకు మనస్తాపం చెంది చిన్న వయస్సులోనే తనువు చాలిస్తు ఎన్నో కలలు కన్న తల్లిదండ్రులకు పుత్రశోకం నింపుతున్నారని అన్నారు. ఇలాంటి విషాద సంఘటనను నియంత్రించడానికి చక్కని సందేశంతో ఉద్దాన కళాకారులు చేసిన ప్రయత్నం అభినందనీయం అన్నారు. దర్శకుడు పుక్కళ్ల రాజేంద్ర, సిక్కోలు జానపద సాహిత్య వేదిక ప్రతినిధి రాపాక ధనరాజు, ఉద్దాన ప్రాంత నృత్యకారులు కుంది రాజా, మాజీ సర్పంచ్ మద్దు నాగేశ్వరరావు, నటీనటులు రాకేష్, చందు ఉన్నారు.

మత్స్య అవతారంలో జగన్నాథుడు దర్శనం



కవిటిలో పూజలందుకుంటున్న స్వామివారు



ఇచ్ఛాపురం టౌన్: ఇచ్ఛాపురం జగన్నాథ స్వామి ఆలయంలో ఇలా..

జగన్నాథ స్వామి రథోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా స్వామివారు రోజుకో రూపంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. రెండో రోజైన శనివారం మత్స్యనారాయణ అవతారంలో స్వామి భక్తులకు దర్శనం ఇచ్చి పూజలు అందుకున్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

– సాక్షి నెట్‌వర్క్

వైద్యానికి ఆర్థిక సాయం



సాయం అందజేస్తున్న ఎస్‌జీఎఫ్ సభ్యులు

ఇచ్ఛాపురం రూరల్: తిప్పనపుట్టుగ గ్రామానికి చెందిన మజ్జి పురుషోత్తం రెండున్నర నెలల కుమారుడు హైడ్రోసెఫలస్ ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న స్పెషల్ గాయ్స్ ఫౌండేషన్ (ఎస్‌జీఎఫ్) స్పందించింది. వైద్య ఖర్చుల కోసం 15 వేల రూపాయలను పురుషోత్తంకు శనివారం అందజేసి అండగా నిలిచారు.

పల్లె పండుగ పైసలెక్కడ?

- నెలలు గడుస్తున్నా అందని బిల్లులు
- లబోదిబోమంటున్న తెలుగు తమ్ముళ్లు

వజ్రపుకొత్తూరు: పార్టీ నేతలు, కార్యకర్తలకు ప్రయోజనం చేకూర్చడంలో టీడీపీది భిన్న శైలి. అధికారంలో ఉన్న వాళ్లు తమవారికి అన్ని విధాలుగా లబ్ధి చేకూరేలా కార్యక్రమాలు రూపొందిస్తారు. అందులో భాగంగా అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల పనులు వారికే అప్పగిస్తుంటారు. పల్లె పండుగ పేరుతో గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువలు నిర్మించి ఎంతో కొంత వెనుకేసుకోవచ్చునని, ప్రభుత్వం తమదే కాబట్టి పనులు పూర్తయిన వెంటనే బిల్లులు వస్తాయని టీడీపీ నేతలు భావించారు. కానీ వారి ఆశలు అడిఆసలయ్యాయి. మదుపులు పెట్టి పనులు చేసి నెలలు గడుస్తున్నా బిల్లులు మంజూరు కాకపోవడంతో మౌనంగా రోదిస్తున్నారు. ఎప్పుడు వస్తాయో కూడా తెలియక లబోదిబో మంటున్నారు. ఆదాయం వస్తుందని ఆశపడి వడ్డీలకు అప్పులు తెచ్చి పనులు చేశామని, బిల్లులు రాకపోవడంతో వడ్డీలు పెరిగిపోయి అప్పుల భారం కుంగదీస్తుందని వాపోతున్నారు. ఇక పోతే బిల్లులు మంజూరైతే పది శాతం కమీషన్ అధికారులకు ఇవ్వాల్సి వస్తోందని, ఇది బహిరంగ రహస్యమేనని తమ్ముళ్లు మరింత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ పెద్దలు తమ కార్యకర్తలకు ఆదాయం వచ్చే మార్గాలపై దృష్టి సారించారు. అందులో భాగంగా పల్లె పండుగ పేరుతో ఉపాధి హామీ పథకం నిధులు ఖర్చు చేసి సీసీ రహదారులు, కాలువ పనులు అప్పగించారు.

నియోజకవర్గంలో ఇలా..

పలాస నియోజకవర్గంలో రూ.94.72 కోట్లుతో 581 పనులకు అనుమతి పొందారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులు పంచాయతీ సర్పంచ్‌లు చేయాల్సి ఉన్నప్పటికీ అధికారులపై ఒత్తిడి తెచ్చి సర్పంచ్‌లకు కూడా వెండర్ విధానంలో టీడీపీ నేతలే పనులు చేశారు. త్వరితగతిన పనులు పూర్తిచేసి బిల్లులు మంజూరు చేయించుకుని కొంత ఆదాయం పొందవచ్చునని అనుకున్నారు. కొంతమందికి పెట్టుబడి పెట్టే స్థోమత లేనప్పటికీ అప్పులు తెచ్చి మరీ పనులు చేశారు. అయితే నెలలు గడుస్తున్నా బిల్లులు రాలేదు. దీంతో టీడీపీ నేతలు అధికారులు చుట్టూ తిరుగుతూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే బిల్లుల చెల్లింపులతో ఇంత ఆలస్యం జరిగితే భవిష్యత్‌లో పనులు ఎలా చేయగలమని కొందరు కార్యకర్తలు గుసు గుసలాడుతున్నారు.



బిల్లు మంజూరు కాని చిన్నమురహరిపురం సీసీ రహదారి



అర్ధాంతరంగా నిలిచిపోయిన ఉద్దానంగో పినాథపురం - అమలపాడు రోడ్డు

అసంపూర్తిగా తారురోడ్లు

పలాస నియోజకవర్గంలో 581 రహదారుల్లో దాదాపు 38 బీటీ రోడ్లు ఉండగా ఇందులో ఒక్కటి కూడా పూర్తి కాలేదు. బిల్లులు దాదాపు రూ.40 కోట్లు చెల్లించాల్సి ఉంది. నిధులు మంజూరు చేయని కారణంగా స్టోన్ డస్ట్, వెట్‌మిక్స్ వేసి వదిలేశారు. దీంతో ఆ రహదారులపై ప్రయాణికులు నరక యాతన అనభవిస్తున్నారు. వజ్రపుకొత్తూరు మండలంలో మురిపింటివానిపేట–నూకలవానిపేట రహదారి, ఎన్‌పీ రోడ్డు నుంచి అమలపాడు వరకు, సైనివానిపేట నుంచి కొమరల్తాడ వరకు, కొమరల్తాడ నుంచి దేవునల్తాడ వరకు రహదారులు బిల్లు మంజూరు చేయని కారణంగా కాంట్రాక్టర్‌లు దిక్కు తోచని స్థితిలో ఉన్నారు.

పలాస నియోజకవర్గంలో పల్లె పండుగ వివరాలు..	
అనుమతులు పొందిన పనులు	581
వెచ్చించిన నిధులు	రూ.94.72 కోట్లు
పూర్తి చేసిన పనులు	364
ఖర్చు చేసిన నిధులు	రూ.6.82 కోట్లు
ఇంకా ప్రారంభం కాని పనులు	220

ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి



పల్లెపండుగ పేరుతో హడావిడి చేసిన కూటమి నేతలు రహదారులు నిర్మాణం, బిల్లుల మంజూరులో శ్రద్ధ చూపకపోవడం విచారకరం. నాడు వైఎస్సార్‌సీపీపై బురద జల్లే చర్యలు చేసి, నేడు అభివృద్ధి, సంక్షేమాన్ని గాలికి వదిలేశారు. ఎంజీ ఎన్‌ఆర్‌ఈజీఎస్ బీటీ రహదారులు అర్ధాంతరంగా ఆగిపోవడంతో ప్రజలు ఆ రహదారులపై ప్రయాణం చేయలేక పోతున్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేసి రహదారులు నిర్మించాలి.

– దున్న బాలరాజు, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు, వజ్రపుకొత్తూరు

త్వరలోనే బిల్లుల చెల్లింపు



పల్లె పండుగ పేరుతో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన సీసీ, బీటీ రహదారులకు సంబంధించిన పనుల బిల్లులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశాం. త్వరలోనే వాటి మొత్తాలు చెల్లిస్తాం. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ నిర్వహించిన సమావేశంలో ప్రస్తావన వచ్చింది. ప్రారంభంలో రూ.2.8 కోట్లు బిల్లు చెల్లించాం. ఇంకా ప్రారంభం కాని పనులు త్వరలో ప్రారంభిస్తాం.

– జి.రవిబాబు, పీఆర్, డీఈఈ, పలాస